



గెలుపుపై అనుమానంతో వైసీపీ అభ్యర్థులు అన్ని అడ్డదారులు తొక్కుతున్నారు. ఇందుకోసం వలంటీర్లను కార్యకర్తల్లా మార్చారు. ప్రజలు కూడా కార్యకర్తల కంటే వలంటీర్లనే విశ్వసిస్తుండటంతో నాయకులు తెలివిగా ఇంటింటికీ పంపిస్తున్నారు. కుక్కర్లు, ఫ్లాస్కులు, డబ్బు వంటి తాయిలాలు ఇవ్వడంతో పాటు తాము గెలిస్తే రూ.10 వేల చొప్పున లబ్ధి చేకూరుస్తామని నాయకులు హామీ ఇస్తుండటంతో వలంటీర్లు కూడా వైసీపీ ప్రచారకర్తల్లా మారి ప్రతి గడపకూ వెళ్లి ప్రచారం చేస్తున్నారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వైసీపీకి ఓటు వేయలని అభ్యర్థిస్తున్న వలంటీర్లు


ప్రియమైన అక్క/అన్న, ...సుబ్బమ్మ గారికి
(...)
ఈ 5 ఏళ్ల పాలనలో మీ కుటుంబానికి ... మీ
అందరి చల్లని దీవెనలతో మనందరి ప్రభుత్వం ఈ పథకాలు
అందించిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.

| | |
|---|---|
| కోవిడ్ సహాయం | : ₹1,000 |
| వైయస్సార్ 0 వడ్డీ (డ్వాక్రా) | : ₹2,856 |
| వైయస్సార్ ఆరోగ్యశ్రీ | : ₹1,53,450 |
| వైయస్సార్ ఆసరా | : ₹10,816 |
| వైయస్సార్ పింఛన్ కానుక | : ₹1,35,750 |
| చేకూరిన లబ్ధి | : ₹3,03,872 |
| మొత్తం లబ్ధి | : ₹3,03,872 |

లబ్ధిదారులకు అందించిన నగదు వివరాలతో ముద్రించిన కరపత్రం

# వలంటీర్లు

## గెలుపు కోసం వైసీపీ నేతల అడ్డదారులు

**(విజయవాడ-ఆంధ్రజ్యోతి/అజిత్‌సింగ్‌నగర్) :** ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని వైసీపీ నేతలు తమతమ నియోజకవర్గాల పరిధిలోని వలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో వారికి తాయిలాలు అందజేసి, తమ గెలుపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు పథకాలను వివరించి, ఇప్పటి వరకు కలిగిన లబ్ధిని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే ఈ పథకాలన్నీ ఆగిపోతాయని చెప్పమంటున్నారు. వలంటీర్లు సైతం వైసీపీ నేతల మాటలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారు.

### పార్టీ ప్రచారకర్తల్లా మారిన వలంటీర్లు

- ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వంపై పొగడ్తలు
- సంక్షేమం పేరు చెప్పి మాయమాటలు
- ఇంత లబ్ధి పొందారంటూ వివరాలతో స్టేట్‌మెంట్
- మళ్లీ ఓటు వేస్తే చాలా వస్తాయంటూ ఎర
- ఇంటింటికీ తిరిగినందుకు వలంటీర్లకు నేతల తాయిలాలు

### ప్రలోభాలు ఇలా..

- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన వెలంపల్లి శ్రీనివాస్‌కు నియోజకవర్గంలో సానుకూల వాతావరణం లేకపోవడంతో గెలుపు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో వలంటీర్లనే నమ్ముకుని ఆయన ముందుకు సాగుతున్నారు. వారికి తాయిలాలు ఇచ్చి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తన కోసం పనిచేయాలని కోరుతున్నారు. నియోజకవర్గంలో వలంటీర్లకు రూ.5 వేలు, కుక్కర్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లకు చీరలు పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం కృషి చేయాలని కోరుతున్నారు. ప్రతి వలంటీర్ వైసీపీకి పనిచేసి గెలుపును కానుకగా ఇస్తే ముందుందు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రలోభపెడుతున్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలో జోగి రమేశ్‌దీ ఇదే పరిస్థితి. ఆయన కూడా వలంటీర్లతో పాటు ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళలు.. ఇలా ఎవరినీ వదలకుండా తాయిలాల వర్షంలో ముంచేస్తున్నారు. ఓవైపు జోగి రమేశ్, మరోవైపు ఆయన తనయుడు రాజీవ్ ఇద్దరూ సమావేశాల మీద సమావేశాలు నిర్వహిస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు.
- విజయవాడ పశ్చిమ, మైలవరం, మచిలీపట్నం, పెడన, నందిగామ, పామర్రు.. ఇలా అభ్యర్థులు ఖరారైన చోట, ఖరారు కానిచోట వైసీపీ నేతలు వలంటీర్లను ప్రలోభాలతో ముంచె త్తుతున్నారు. అధికశాతం మంది రూ.5 వేలతో పాటు కుక్కర్లు, స్మార్ట్ వాచ్‌లు, ఫ్లాస్కులు వంటి తాయిలాలను ఇస్తున్నారు.

### వైసీపీ కార్యకర్తల్లా..

వైసీపీ నేతల తాయిలాలతో వలంటీర్లు మరింత రెచ్చిపోతున్నారు. పక్కా వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. సోమవారం నున్న గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో గ్రామ వలంటీర్ నిరంజన్ పక్కా వైసీపీ కార్యకర్తలా వేదిక ఎక్కి రాజకీయ ఉపన్యాసం చేయడం గమనార్హం. సెంట్రల్ నియోజకవర్గంతో పాటు మైలవరం, పెనమలూరు వంటి నియోజకవర్గాల్లో తాయిలాలు అందుకున్న వలంటీర్లు స్వామిభక్తిని చాటుకుంటున్నారు. వివిధ పథకాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి గడప గడపకు సంక్షేమం పేరుతో ముద్రించిన కరపత్రాలను అందజేస్తున్నారు. సదరు కరపత్రాల్లో లబ్ధిదారులకు ఏ పథకం ద్వారా ఎంత నగదు లబ్ధి చేకూరిందన్న వివరాలను దగ్గరుండి మరీ వివరిస్తున్నారు. 'ఆ దేవుడి ఆశీస్సులతో ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో మీకు జరిగిన మంచి ఇది. మళ్లీ వైసీపీ ప్రభుత్వానికి ఓటు వేయండి' అని లబ్ధిదారులకు నూరిపోస్తున్నారు. కొన్నిచోట్ల సచివాలయ సిబ్బంది సైతం వీరికి జత కలుస్తున్నారు.

### నోటిఫికేషన్ వచ్చేలోపే..

నాలుగైదు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో వలంటీర్ల ద్వారా ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు వైసీపీ నేతలు తెగ ప్రయత్నిస్తున్నారు. వలంటీర్లను సొంత పార్టీ కార్యకర్తల్లా వినియోగించుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే వలంటీర్లకు చెక్ పడుతుందన్న భయంతో హడావిడిగా ఈ వ్యవహారాలను చక్కబెడుతున్నారు.

## జగన్ 126 సార్లు బటన్ నొక్కారు

### ఆయన కోసం మనం రెండుసార్లు బటన్ నొక్కుదాం..

### నున్న గ్రామ వలంటీర్ నిరంజన్ రాజకీయ ప్రసంగం




**విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) :** 'జగన్ ఈరోజు రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారు. ప్రతి మహిళా సంతోషంగా ఉంటే రాష్ట్రం సంతోషంగా ఉంటుందనే లక్ష్యంతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అలాంటి జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలి. ఆయన్ను గెలిపించుకోవాలంటే మన ఎమ్మెల్యే అభ్యర్థిని మనం గెలిపించుకోవాలి. మనకోసం 126 సార్లు జగన్ బటన్ నొక్కారు. మనం రెండుసార్లు ఆయన కోసం బటన్ నొక్కలేమా? మనమందరం కలిసి జగన్‌ను గెలిపించుకుందాం. ఎన్నికల వేళ చాలామంది వస్తారు. అది చేస్తాం ఇది చేస్తాం అని అంటారు. ఆ మాటలేవీ నమ్మవద్దు.' విజయవాడ గ్రామీణ మండలం నున్న గ్రామ వలంటీర్ నిరంజన్ చేసిన రాజకీయ ప్రసంగం ఇది. సోమవారం నున్నలోని చెరువు సెంటర్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది.

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నిర్వహించే టెండర్లలో ఒక ఉద్యోగి చక్రం తిప్పుతున్నాడు. కాంట్రాక్టర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో కోట్ చేసిన ధరల వివరాలను ముందే తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు లీక్ చేస్తూ భారీగా లబ్ధి పొందుతున్నాడు. ఫలితంగా దుర్గగుడికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

# ఆదాయానికి టెండర్ పెట్టాడు..!

### దుర్గగుడి కంప్యూటర్ ఆపరేటర్ అవినీతి

- అనుకూల కాంట్రాక్టర్లకు ముందే ధరలు లీక్
- తక్కువకు కోట్ చేస్తున్న కాంట్రాక్టర్లు
- సదరు ఆపరేటర్‌కు భారీగా లబ్ధి
- దుర్గగుడి ఆదాయానికి మాత్రం గండి



**(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) :** దుర్గగుడిలో వివిధ విభాగాలకు అవసరమైన సరుకులకు, అభివృద్ధి పనులకు అధికారులు ఈ-ప్రొక్యూర్‌మెంట్, ఓపెన్ టెండర్లు, సీల్ టెండర్లు నిర్వహిస్తుంటారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ విభాగమంతా ఓ కంప్యూటర్ ఆపరేటర్ పర్యవేక్షణలో ఉంటుంది. దీనిద్వారా పిలిచే టెండర్లలో గోల్‌మాల్ జరుగుతోందని ఇటీవల దుర్గగుడి అధికారులు గుర్తించారు. దీనిపై అంతర్గతంగా జరిగిన విచారణలో సదరు కంప్యూటర్ ఆపరేటర్ వివిధ టెండర్లకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా వేర్వేరు కాంట్రాక్టర్లు కోట్ చేసే ధరలను ముందే తెలుసుకుని తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు లీక్ చేస్తున్నారని తేలినట్టు సమాచారం. ఇలా ఆ కంప్యూటర్ ఆపరేటర్ లీక్ చేసిన ధరలను బట్టి కాంట్రాక్టర్లు ధరలు కోట్ చేసి టెండర్లు దక్కించుకుంటున్నారు. ఈ వ్యత్యాసం రూ.100 నుంచి రూ.1,000 లోపే ఉంటుండటంతో ఇతర కాంట్రాక్టర్లకు అనుమానం వచ్చి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తీగ లాగితే డొంక కదిలినట్లు అసలు బండారం బయటపడింది.

### గతంలో సస్పెండైనా మళ్లీ కీలక పదవి

ఏళ్ల తరబడి కంప్యూటర్ విభాగంలో పనిచేస్తున్న ఆ ఉద్యోగి ఆన్నీతానై వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. సదరు ఉద్యోగి గతంలో దేవస్థానంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురికి మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేయడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పట్లో ఆలయ అధికారులు కూడా అతన్ని సస్పెండ్ చేశారు. గతంలో రూ.25 టికెట్ల గోల్‌మాల్‌లో కూడా ఇతనిపై ఆరోపణలు వచ్చాయి. ఇటీవల కంప్యూటర్ బిల్లు పేపర్ రోల్ కొనుగోలు చేయకపోయినా చేసినట్లు దొంగ బిల్లు పెట్టి దేవస్థానం నుంచి డబ్బు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా టెండర్ల వ్యవహారంలో ఇతను కీలకపాత్ర పోషించి తనకు అనుకూల కాంట్రాక్టర్ల నుంచి పెద్ద మొత్తంలో దండుకుంటున్నాడని సమాచారం.

## ధాన్యం డబ్బు కోసం ధర్నా

- 6లో..

రొయ్యూరు క్వారీలో ఇసుక తవ్వకాలు



# అక్రమాలను ప్రశ్నిస్తే దాడి!

## రొయ్యూరు క్వారీలో పేట్రేగిపోతున్న తవ్వకందారులు

- అక్రమాన్ని ప్రశ్నించిన లారీ యజమాని
- పోలీసును పిలిపించి కొట్టించిన వైనం
- ఆత్మహత్య చేసుకుంటానని వెళ్లిన బాధితుడు
- క్షమాపణ చెప్పిన పోలీసు

రొయ్యూరు క్వారీ నిర్వాహకుల అక్రమాలు తీవ్రమవుతున్నాయి. ప్రశ్నించిన వారిపై దాడులు జరుగుతున్నాయి. 'మా క్వారీ మా ఇష్టం, మమ్మల్ని ఎవ్వరూ ప్రశ్నించడానికి వీల్లేదు' అన్నట్టు నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. అక్రమాలను ఎత్తిచూపితే పోలీసులను రంగంలోకి దించి కొటిస్తున్నారు. తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతున్నారు. ఆ అవమాన భారాన్ని తట్టుకోలేక బాధితులు ప్రాణాలు తీసుకోవడానికి సిద్ధపడేలా చేస్తున్నారు. క్వారీలో సోమవారం ఇదే జరిగింది. నిర్వాహకుల తీరుని ప్రశ్నించిన లారీ యజమానిని పోలీసు కొట్టడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

**తోట్లవల్లూరు, మార్చి 11 :** కంకిపాడు మండలం గొడవర్రుకు చెందిన లారీ యజమాని సోమవారం ఇసుక కోసం స్లిప్ రాయించుకునేందుకు క్వారీకి వచ్చాడు. అతనిని పట్టించుకోకుండా స్లిప్‌లు లేని లారీలను క్వారీలోకి పంపించటంతో అతను ప్రశ్నించాడు. 'ఏంటి మమల్నే ప్రశ్నిస్తావా?' అంటూ నిర్వాహకులు పోలీసులకు ఫోన్ చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పోలీసు అధికారి క్వారీ వద్దకు వచ్చి లారీ యజమానిని కొట్టి దుర్భాషలాడారు. దీంతో ఆ లారీ యజమాని అవమాన భారంతో ఆత్మహత్య చేసుకుంటానని ఓ కాగితంపై రాసి వెళ్లిపోయాడు. ఆ లారీ యజమాని ఏనుగులకోడు డ్రైన్ వైపునకు వెళ్లడంతో అతనిని పోలీసు సిబ్బంది, అతని కుటుంబ సభ్యులు చాలాసేపు గాలించారు. ఎట్టకేలకు లారీ యజమానిని సురక్షితంగా పట్టుకోవటంతో పోలీసు అధికారి గొడవర్రు వెళ్లి క్షమాపణ చెప్పటంతో కథ సుఖాంతమయింది. ఆ తరువాత మధ్యాహ్నం 3 గంటల నుంచి ఇసుక తవ్వకాలను నిలిపుదల చేశారు.

### ● ఇసుక దోపిడీ.. ఎమ్మెల్యేకు పట్టదా?

రొయ్యూరు ఇసుక క్వారీపై మూడు నెలలుగా ఆరోపణలు వస్తున్నా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఏనాడు పట్టించుకున్న దాఖలాలు లేవు. మంత్రి జోగి రమేష్ అనుచరులు చొరబడినా తనకు సంబంధం లేదన్నట్టుగా ఉండటంతో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండా అక్రమాలకు క్వారీ నిర్వాహకులు ఎలా తెగబడతారని, పక్క నియోజకవర్గం నేతలు ఎలా సొమ్ము చేసుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఎమ్మెల్యేకు ఫిర్యాదు

సీఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



వల్లూరుపాలెంలో ఉన్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ని మాజీ ఎంపీటీసీ సభ్యుడు చప్పిడి రామ్మోహన్‌రావు మరో పదిమంది కార్మికులు కలిసి రొయ్యూరు క్వారీ ఘటనపై ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడే ఉన్న సీఐ కిషోర్‌బాబును ఎమ్మెల్యే పిలిచి వివరణ అడిగారు. తాను ఎవ్వరినీ కొట్టలేదని సీఐ బదులిచ్చారు. అయితే క్వారీలో నిబంధనల ప్రకారం యంత్రాల వినియోగం చేయకూడదని, కార్మికుల తోనే చేయాలని ఉందని, యంత్రాల వినియోగం ఆపి కార్మికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూముల్లో ఇసుక తవ్వకూడని నిబంధన ఉన్నా అది అమలు కాలేదని తెలిపారు.

# నష్టాల్లో దిగుబడి..

మినుముతీత అనంతరం పొలంలో ఉన్న పంట



## మినుము సాగు చేసిన రైతులు డీలా

ఈ ఏడాది మినుము రైతులకు నిరాశే మిగులుతోంది. సకాలంలో పంటసాగు చేసేందుకు అవకాశం లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పంట దిగుబడి తగ్గింది. కంకిపాడు, ఉయ్యూరు దివిసీమ ప్రాంతంలోని కృష్ణానదీ తీరం వెంబడి మండలాల్లో ఎకరానికి ఏడు నుంచి తొమ్మిది క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన మినుము నాలుగైదు క్వింటాళ్లు మాత్రమే వస్తుండటంతో నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లకు మించి రాని పంట
- మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో తగ్గిన దిగుబడులు
- మార్కెట్‌లో మద్దతు ధర ఉన్నా దిగుబడి తగ్గడంతో రైతుల దిగాలు

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో రైతులు మినుము సాగు చేశారు. డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీవర్షాల వల్ల పొలాల్లో రోజుల తరబడి నీరు నిల్వఉండి మినుము మొక్కలు చనిపోయాయి. దీంతో పొలాన్ని దమ్ముచేసి రెండోసారి మినుము విత్తనాలు చల్లారు. దీంతో మినుము సాగు తొలిదశలోనే రైతులు అధికంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. తుపాను కారణంగా 20 నుంచి నెలరోజుల పాటు మినుము సాగు ఆలస్యం కావడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడింది. ఫిబ్రవరిలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో దిగుబడులపై ఆ ప్రభావం పడిందని రైతులు అంటున్నారు. మినుము విత్తిన నెలరోజుల నుంచి 40 రోజుల్లోపు ఒక తడుపునకు నీరు ఇవ్వాల్సి ఉండగా, సాగునీటి కాలువలకు నీరు విడుదల చేయకపోవడంతో మినుము పైరుకు అదనులో నీరు పెట్టలేకపోవడం కూడా దిగుబడి తగ్గడానికి ఒక కారణమని రైతులు చెబుతున్నారు.

### ● తగ్గిన దిగుబడి

రైతులు అన్ని జాగ్రత్తలూ తీసుకుని మినుము పంటను సాగుచేస్తే ఎకరానికి కనీసంగా ఆరు క్వింటాళ్లు, అధికంగా తొమ్మిది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు, తోట్లవల్లూరు, దివిసీమ ప్రాంతంలోని చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ తదితర మండలాల్లో ఎకరానికి నాలుగైదు క్వింటాళ్ల దిగుబడికే పరిమితమవుతోంది.

### ● పురుగుమందులకే రూ.20వేల ఖర్చు

ఈ ఏడాది మినుముసాగులో పురుగుమందులకే ఎకరానికి రూ.20వేలకుపైగా రైతులు ఖర్చుచేశారు. మినుముకు ఎల్లోమొజాయిక్ తెగులు, ఆకు ముడత, బూడిదతెగులు నివారణకోసం, పూత నిలబడటానికి, పిందె రాలిపోకుండా ఉండటానికి పలు దఫాలుగా వివిధ రకాల రసాయనాలను పైరుపై పిచికారీ చేయడంతో పురుగుమందుల ఖర్చు తడిచి మోపెడైంది. వివిధ రకాల పురుగుమందుల కంపెనీల ఏజెంట్లు మినుముపంట పొలాలను పరిశీలించి పైరుకు తెగుళ్లు వ్యాపించాయని, వీటి నిర్మూలన కోసం పురుగుమందులను పిచికారీ చేయాలని తమదైన శైలిలో సూచనలు చేశారు. రైతులు అధిక దిగుబడులు సాధించాలనే పోటీతత్వంతో విరివిగా పురుగుమందులను వినియోగించడంతో ఖర్చు అధికమైంది.

### ● మద్దతు ధర క్వింటాలుకు రూ.6,900

ప్రభుత్వం ఈ ఏడాది మినుము క్వింటాలు మినుము మద్దతు ధరను రూ.6,900గా నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో మినుము క్వింటాలు రూ.9,200 వరకు పలుకుతోంది. మినుములో నాణ్యత తక్కువగా ఉంటే ఓ రూ.500 ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులు రైతుల నుంచి మినుమును కొనుగోలు చేసి తెనాలి మార్కెట్‌కు మినుమును తరలిస్తున్నారు. గతేడాది క్వింటాలు మినుము రూ.7,200లకు కొనుగోలు చేయగా, ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో రూ.9,200 మేర ధర పలుకుతోంది. అయితే ఈ ఏడాది దిగుబడులు సగానికి సగం పడిపోవడంతో రైతులకు నిరాశే మిగులుతోంది. ఎకరానికి మినుము సాగు నిమిత్తం ఈ ఏడాది రూ.30 వేల నుంచి రూ.35వేలు ఖర్చు చేశామని, నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుండటంతో మినుము సాగులో ఈ ఏడాది అతి తక్కువగా మిగులుతోందని రైతులు వాపోతున్నారు. ఎకరానికి మినుముతీతకు రూ.ఏడువేలు, పోగుచేసినందుకు రూ.రెండువేలు, మిషన్ ద్వారా నూర్పిడిచేస్తే 70 కిలోల బస్తాకు రూ.200, ఇతరత్రా ఖర్చుల రూపంలో నూర్పిడికే రూ.పదివేలు అవుతోందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటచేతికొచ్చే సమయంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న ధాన్యాన్ని బస్తాకు రూ.200 వరకు తక్కువ ధరకే విక్రయించారు. ఈ లోటు మినుము సాగు ద్వారా భర్తీ అవుతుందని రైతులు ఆశించారు. మినుము దిగుబడులు సగానికిసగం తగ్గడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి.

## 'పశ్చిమ' కోసం బీజేపీ పట్టు

**(విజయవాడ-ఆంధ్రజ్యోతి) :** టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో సోమవారం జరిగిన చర్చల్లో సీట్ల సర్దుబాటులో భాగంగా విజయవాడ పశ్చిమ సీటును బీజేపీ కోరినట్లు సమాచారం. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పశ్చిమ, కృష్ణాజిల్లాలో అవనిగడ్డ స్థానాలను జనసేనకు కేటాయించారు. పొత్తుల సర్దుబాటులో భాగంగా పశ్చిమను బీజేపీ కోరినట్లు సమాచారం. ఇక్కడి నుంచి జనసేన అభ్యర్థిగా పోతిన మహేశ్ పేరు ప్రచారంలో ఉంది. ఈ స్థానం బీజేపీ ఖాతాలో పడితే ఎవరు పోటీ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బీజేపీ తీర్థం పుచ్చుకుని పశ్చిమ నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం నడుస్తోంది. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధికి చెందిన ఎన్ఆర్ఐ గొలగాని రవికృష్ణ ఇటీవలే బీజేపీలో చేరారు. ఆయన పేరు కూడా వినిపిస్తోంది.



కేంద్ర మంత్రికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

## దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి

బీజేపీ-జనసేన-టీడీపీ అభ్యర్థుల ఎంపిక నిమిత్తం విజయవాడ వచ్చిన కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సోమవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయఅధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు. - **వన్‌టౌన్**




ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న రైతులు, నేతలు

## ధాన్యం డబ్బుల కోసం ధర్నా

**ఉయ్యూరు, మార్చి 11 :** సిద్ధం సభలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ధాన్యం తోలిన రైతులకు డబ్బులు చెల్లించడానికి చేతులు రావడంలేదని టీడీపీ, జనసేన నేతల ఆధ్వర్యంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ రైతులు టీడీపీ, జనసేన నేతలతో కలిసి సోమవారం ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పెనమలూరు ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి ధాన్యం తోలిన రైతులకు జనవరి నెల నుంచి డబ్బురాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దగా చేస్తున్న ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. టీడీపీ నాయకులు కుటుంబరావు, శ్రీనివాసరావు, ప్రభాకర్, వెలగపూడి శంకర్‌బాబు, పూర్ణచంద్రరావు, కుటుంబరావు, కుప్పాల అంజిబాబు, జనసేన నాయకులు జ రుగు ఆదినారాయణ, ముప్పారాజు, శివ ప్రసాద్, కార్తికేయ, చినకోటయ్య, మహాలక్ష్మి రైతులు పాల్గొన్నారు.



సభలో నేతలు ప్రసంగిస్తుండగానే బయటకు వెళ్లిపోతున్న మహిళలు


## బాబోయ్ వైసీపీ సభ..!

**» నేతల ప్రసంగాలు వినలేక.. మధ్యలోనే మహిళల పలాయనం**

**ఇబ్రహీంపట్నం, మార్చి 11 :** పార్టీ అధినేత బాటలోనే.. వైసీపీలో కిందిస్థాయి నేతలు కూడా ఊకదంపుడు ప్రసంగాలు చేస్తుండటంతో.. భరించలేక గ్రామాల్లో సభల నుంచి మహిళలు పలాయనం చిత్తగిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలం పరిషత్ కార్యాలయంలో సోమవారం చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చోటా మోటా నాయకులు మాట్లాడుతుండగానే పలువురు మహిళలు లేచి వెళ్లిపోవడం కనిపించింది. గంటల తరబడి నేతల పసలేని ప్రసంగాలు వినలేక మహిళలు లేచి వెళ్లిపోయారు. గతంలో డ్వాక్రా రుణమాఫీ చెక్కుల పంపిణీ సమయంలో గేట్లు వేసి సభను నిర్వహించడంతో పెద్ద ఎత్తున మహిళలు తిరగబడ్డారు. దాంతో గేట్లు తీసి సభను నిర్వహించంతో మహిళలు సభ నుంచి వెళ్లిపోయారు. సభ మధ్యలోనే సగానికి ఖాళీ అయ్యింది.

## యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు!

**» లారీలను అడ్డుకున్న గ్రామస్థులు » కలెక్టర్‌కు ఫిర్యాదు**



**విజయవాడ రూరల్, మార్చి 11 :** విజయవాడరూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా జరుగుతోంది. అధికార పార్టీ నేతలు అర్ధరాత్రి సమయంలో అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ నేతలు, గ్రామస్థులు ఆదివారం అర్ధరాత్రి గ్రామ శివారుల్లో మైనింగ్ లారీలను అడ్డుకున్నారు. నాలుగు లారీలను అడ్డుకుని అధికారులకు సమాచారం అందించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై సోమవారం గ్రామస్థులతో కలసి టీడీపీ నేతలు జిల్లా కలెక్టర్ దిల్లీరావుకు స్పందనలో ఫిర్యాదు చేశారు.

## ఉత్కంఠభరితంగా ఎడ్ల పూటీ లాగుడు పోటీలు

**» సీనియర్ విభాగంలో కృష్ణా, జూనియర్‌లో గుంటూరు ఎడ్ల గెలుపు**

**నందిగామ రూరల్, మార్చి 11:** మహాశివరాత్రి సందర్భంగా దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద రైతుకమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పూటీ లాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. సీనియర్ ఎడ్ల జత పోటీలను ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఎనిమిది జతల ఎడ్లు పాల్గొన్న విభాగంలో రెండు క్వింటాళ్ల 10 నిమిషాల వ్యవధిలో ఆరుగురు వ్యక్తులతో పోటీలు సాగాయి. జూనియర్ ఎడ్ల విభాగంలో గుంటూరు జిల్లా కాకునూరు మండలం గార్లపాడు గ్రామానికి చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత 3,843 అడుగుల దూరం కృష్ణాజిల్లా కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన వెలిశెట్టి ఉమామహేశ్వరరావు, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలుకు చెందిన వాకా నాగబాబు ఎడ్ల జత 3,789 అడుగుల దూరం లాగి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెద్దపుడి గ్రామానికి చెందిన ఆళ్ల హరికృష్ణ ఎడ్లు 3,646 అడుగులు లాగి మూడో స్థానంలో నిలవగా బాపట్ల జిల్లా కొత్తూరు మండలం, అనంతవరానికి చెందిన లీలాసాయి మనోహర్ ఎడ్లు 3,553 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. దాతలు కొమ్మినేని రవిశంకర్, కోవెలమూడి వెంకట నారాయణ, నిడమానూరు నరసింహారావు, మహేశ్వరరావు, వంశీకృష్ణ, చెరుకూరి రమేష్ యూత్ ఎడ్ల యజమానులకు రూ. 30 వేలు, 20 వేలు, 15 వేలు, 10 వేల నగదును అందజేశారు.

● సీనియర్ విభాగంలో కృష్ణాజిల్లా కోడూరు మండలం విశ్వనాథపల్లికి చెందిన వెలిశెట్టి ఉమామహేశ్వరరావు ఎడ్ల జత 4,144 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలవగా కంచికచర్ల మండలం మోగులూరు గ్రామానికి చెందిన షేక్ ఖాజీ ఎడ్లు 3,900 లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఎమ్మినేనివారిపాలెంకు చెందిన ఎమ్మినేని రుష్యేంద్ర కుమార్‌కు చెందిన ఎడ్ల జత 3,734 దూరం లాగి మూడవ స్థానంలో, తోట్లవల్లూరు మండలం చిన్నపులిపాక ఆర్‌బిఎస్ బుల్స్ ఎడ్లు 3,642 అడుగుల దూరం లాగి నాలుగవ స్థానంలో నిలిచాయి. రూ. 25 వేలు, 15 వేలు, 10 వేలు, 7,500లను దాతలు చిట్లూరి రవీంద్రబాబు, చెరుకూరి రమేష్, నాదెండ్ల శ్రీనివాస చౌదరి, కోవెలమూడి వెంకటేశ్వరరావు, కొలకలూరి వెంకటేశ్వరరావులు అందజేశారు. రైతు కమిటీ సభ్యులు వట్టికొండ చంద్రమోహన్, కొలకలూరి వెంకటేశ్వరరావు, గుత్తా సురేష్, ఈదర వెంకట్రావ్, శ్రీహరి, కనగాల రాంబాబు, మందా రవికుమార్, పురుషోత్తం, వెంకయ్య, వెంకటరెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్కంఠభరితంగా సాగుతున్న పోటీలు

ఐదేళ్ల వైసీపీ పాలనలో

# కుంటుపడిన గ్రామాభివృద్ధి

**» పంచాయతీలు నిర్వీర్యమయ్యాయి : ఎమ్మెల్యే వసంత**

**జి.కొండూరు, మార్చి 11 :** కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం వైసీపీ ప్రభుత్వం జమ చేసుకోవడంతో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం కావడమే కాక గ్రామాభివృద్ధి కుంటుపడిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు, గడ్డమణుగు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా వసంత మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ నిర్వాకానికి చాలా గ్రామాల్లో నిధుల్లేక చిన్న చిన్న పనులు కూడా చేయలేక ప్రజా ప్రతినిధులుగా ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. అంగబలం, అర్థబలంతో పాటు అధికారం చేతిలో ఉండటంతో మరో మారు అధికారంలోకి వచ్చేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. ఏపీలో శాంతి భద్రతల సమస్య ఉందన్నారు. విధాన పరమైన ఎన్నో లోపాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. రాజ్యాంగం సైతం అపహాస్యమవుతుందన్నారు. టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తేనే వీటన్నింటికి పరిష్కారం లభిస్తుందన్నారు. మైలవరం అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమన్నారు. అభివృద్ధి-సంక్షేమం తనకు రెండు కళ్లులాంటివన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి 2024లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని అధికారంలోకి తీసుకువద్దామని పిలుపునిచ్చారు. తెలుగుదేశంలో చేరి మీలో ఒకడిగా మీతో కలిసి నడవడానికి మీ వద్దకు వచ్చానని స్పష్టం చేశారు. చింతలపూడి పూర్తి చేయడంతో పాటు తారకరామ చివరి భూములకు సాగునీరు అందించేందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో కోమటి సుధాకర్, బంపాల సీతారామయ్య, కె.విజయబాబు, బొర్రా అశోక్ కుమార్, ఉయ్యూరు వెంకట నరసింహారావు, పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ, గడ్డమణుగు ఎంపీటీసీ నూతక్కి అపర్ణ, నూతక్కి రాజారావు, అప్పసాని వెంకటేశ్వరరావు (వెంకయ్య), నెప్పల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వసంత వెంకట కృష్ణ ప్రసాద్

జగన్ వైఫల్యాలకు పరాకాష్ట..

## మేదరమెట్ల సభ అట్టర్‌ఫ్లాప్

**» నెట్టెం రఘురాం ధ్వజం**



**జగ్గయ్యపేట, మార్చి 11 :** జగన్ ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేయకుండా మాట తప్పి ప్రజా విశ్వాసం కోల్పోయాడని, అందుకు పరాకాష్ట మేదరమెట్ల సభ అట్టర్ ఫ్లాప్ కావటమే అని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. సోమవారం విలేకర్లతో నెట్టెం మాట్లాడుతూ, 6 జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి వందల సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేసినా లక్ష మంది కూడా హాజరు కాలేదని, గ్రాఫిక్స్‌తో జగన్ మీడియా వైఫల్యాలను కప్పిపుచ్చి ప్రచారం చేసుకుంటోందని, అసలు రంగు బయట పడుతుందనే మీడియాను అనుమతించలేదని ఆరోపించారు. అంతా బాగా చేశానని చెప్పుకుంటున్న జగన్ రెడ్డి ప్రతిపక్షాల ఐక్యతను చూసి ఎందుకు భయపెడతున్నాడని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నేరవేర్చాననే చెప్పుకుంటున్న జగన్‌ను ప్రజలు విశ్వసించటం లేదని, ఎన్నికల్లో ఓటమి తప్పదని అన్నారు.



## దళిత క్రైస్తవుల్ని ఎస్సీలుగా గుర్తించింది టీడీపీనే : కేశినేని చిన్ని

**లక్ష్మీపురం(తిరువూరు)మార్చి 11 :** దళిత క్రైస్తవుల్ని ఎస్సీలుగా గుర్తించింది టీడీపీ ప్రభుత్వామే అని, తిరిగి టీడీపీ ప్రభుత్వం రావడం ద్వారా క్రైస్తవ కార్పొరేషన్ ఏర్పాటు జరుగుతుందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని)అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీపురంలో జరిగిన పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్‌తో కలిసి చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వంలో క్రిస్మస్ కానుకను అందిస్తే వైసీపీ ప్రభుత్వం పండగనాడు పేదప్రజల్ని పస్తులకు గురిచేసిందని విమర్శించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, పిల్లల బంగారు భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

**» డీఈవో తాహెరా సుల్తానా**

**మచిలీపట్నం టౌన్, మార్చి 11 :** ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని డీఈవో తాహెరా సుల్తానా చెప్పారు. సోమవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 295 ఉన్నత పాఠశాలలకు చెందిన 26507 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నాని, 14450 మంది బాలురు, 12052 మంది బాలికలు ఉన్నారన్నారు. 151 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 19 ఫ్లయింగ్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం సెట్ 1 ప్రశ్నాపత్రాలు వచ్చాయని, మంగళవారం సెట్ 2 ప్రశ్నాపత్రాలు వస్తున్నాయన్నారు. విద్యార్థులను ప్రణాళికా బద్ధంగా చదివించాలని, మొదటి మూడు స్థానాల్లో ఏదో ఒకటి కృష్ణాజిల్లాకు దక్కుతుందన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని, ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. పరీక్ష పరిశీలకులుగా కెశ్రీనివాసులురెడ్డిని నియమించారన్నారు.

# కండువాలు మార్చే బుద్ధి లేదు



**» పోటీ చేయనని చంద్రబాబుకే చెప్పా : మండలి బుద్ధప్రసాద్**

**ఘంటసాల, మార్చి 11 :** నేడు రాజకీయాలు చూస్తుంటే అసహ్యమేస్తున్నాయి.. ఈ మధ్య కాలంలో నా సీటు గురించి తర్జనభర్జనలు జరుగుతున్నాయి.. టిక్కెట్ కోసం ఎవరినీ దేహించాల్సిన అవసరం నాకు లేదు.. అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు. టిక్కెట్ విషయమై ఎస్సీ, బీసీ, ఎస్టీల్లోనే తనకు సానుభూతి ఎక్కువ వచ్చిందన్నారు. రాజకీయ పార్టీలు అందరినీ సమన్వయం చేసుకోవాలన్నారు. మిగతా వారి ఆలోచనలు కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. తన ఆలోచనంతా ప్రజలే అని, సంపాదన కాదన్నారు. వ్యక్తిగత అవసరాల కోసం ఎవరినీ ఉపయోగించుకోలేదన్నారు. దివిసీమలో అనేక పోరాటాలు చేశామని, పార్టీ పిలుపు ఇవ్వకపోయినా ప్రజల కోసం, ప్రజా సమస్యల కోసం పోరాటం చేశామన్నారు. నా గురించి టిక్కెట్ కావాలని ఎవరినీ అడగొద్దని నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా సూచించారు. వైసీపీ నుంచి ఆహ్వానం వచ్చిన మాట వాస్తవమేనని, కండువాలు మార్చే బుద్ధి తనకు లేదన్నారు. ఈ మధ్య కాలంలోనే పార్టీలో చేరకుండానే టిక్కెట్లు ప్రకటించేస్తున్నారని, పార్టీ కోసం కష్టపడే వారిని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాల గురించే ఆలోచన అన్నారు. నేటి రాజకీయాలను చూస్తుంటే అసహ్యమేస్తున్నదన్నారు. తాను పోటీ చేయనని గత ఏడాదే చంద్రబాబునాయుడికి చెప్పానని, ఆయన వద్దని వారించినట్టు తెలిపారు. ప్రజాస్వామ్యం నేడు ధనస్వామ్యంగా మారిందన్నారు. ఇలా అయితే రాజకీయాలు ఎలా చేస్తామన్నారు. ఓటుకు నోటు అనే భావన పోకపోతే ప్రజాస్వామ్యానికి విలువ లేదన్నారు. తనకు వ్యక్తిత్వమే ముఖ్యమన్నారు. ప్రజల మధ్య లేనివాళ్లు వస్తుంటే ఎందుకు తగ్గి ఉండాలన్నారు. సామాన్య కార్యకర్త అభిప్రాయాలు కూడా పార్టీలు తెలుసుకోవాలన్నారు. సీటును కోరుకోవటం లేదు కాబట్టే గట్టిగా మాట్లాడుతున్నానన్నారు. సామాన్యుడు కూడా చట్ట సభలో కూర్చొనే విధంగానే మార్పు రావాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని, పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు.

# కోడ్ వచ్చేలోగా పనులు పూర్తిచేయండి

**» స్పందనలో కృష్ణా కలెక్టర్ రాజాబాబు**

**మచిలీపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) :** మూడురోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని, ఈలోగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో జేసీ గీతాంజలిశర్మ, ఇతర అధికారులతో కలసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేలోగా ఇంటిపట్టాల పంపిణీ, డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్, భూహక్కు పత్రాలు, ఆరోగ్యశ్రీకార్డులు, అయుష్మాన్‌భారత్ కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సచివాలయ భవనాలు, ఆరోగ్యకేంద్రాలు, ఆర్‌బీకేల నిర్మాణపనులు, ఇతరత్రా పనులను పూర్తిచేసి ఆయా విభాగాల అధికారులకు అప్పగించాలన్నారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలో ఎన్నికల పరిశీలకులు జిల్లాకు వస్తారని, ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలకు వెనుకాడబోమన్నారు. స్పందన అర్జీలకు సంబంధంలేని వ్యక్తులకు ప్రభుత్వ పరమైన ఎండార్స్‌మెంట్‌లు ఇవ్వవద్దన్నారు. స్పందన అర్జీలు సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్వో కె.చంద్రశేఖర్, ఆర్డీవో ఎం.వాణి, డీఎస్‌వో పార్వతి, డీపీవో నాగేశ్వరనాయక్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

**నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు**

రాష్ట్రఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గానికి ఈవీఎంలను కేటాయించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్‌హాలులో ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ జరిగింది. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆయా నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను కేటాయించే ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈవీఎంల నోడల్ అధికారి నిత్యానందం, సమన్వయకర్త నాగేశ్వరనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్పందన అర్జీలు పరిష్కరించాలి

**» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు**

**కృష్ణలంక :** స్పందనలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, అర్జీదారులకు సత్వర న్యాయాన్ని అందించడమే అధికారుల ప్రధాన లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావులు అర్జీదారుల వినతులు స్వీకరించారు. జిల్లాస్థాయి స్పందనలో 121 అర్జీలు నమోదు కాగా.. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీలను అలసత్వం లేకుండా అర్జీదారుడు



సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోను రీ ఓపెన్‌కాకుండా వుండాలన్నారు. అర్జీలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డ్వామ పీడీ జె.సునీత, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**ఎన్నికల విధుల్లో నిబద్ధత అవసరం : కలెక్టర్**

**వన్‌టౌన్ :** ఎన్నికల విధుల పట్ల పూర్తిస్థాయి నిబద్ధత ముఖ్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో వ్యయ నిర్వహణకు సంబంధించి విధివిధానాలు రిజిస్టర్‌ల రోజువారీ నివేదికలు, వివిధ ఫారాలు, రేట్ల చార్టులు, పెయిడ్ న్యూస్, మీడియా మానిటరింగ్‌లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ముద్రించిన హ్యాండ్‌బుక్‌లు, మ్యానువల్‌లు, చెక్‌లిస్ట్‌లను ఉపయోగించుకుని అందులో ఉన్న మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయం, నిబద్ధతతో పనిచేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, ఎన్నికల వ్యయపర్యవేక్షణ నోడల్ అధికారి సీహెచ్ శైలజా, నోడల్ అధికారి ఎస్వీ శివప్రసాద్ యాదవ్, డీపీవోఎస్.శ్రీనివాసరెడ్డి, డీఐపీఆర్‌వో యూ.సురేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.




లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

ఎంపీ బాలశౌరి చొరవతో

# రూ.35కోట్ల రుణాలు

**» డెయిరీఫాం, మత్స్యసంపదను విక్రయించే వారికి రుణాలు**

**» తొలివిడతగా రూ.5కోట్ల పంపిణీ**

**మచిలీపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) :** మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిచొరవతో మచిలీపట్నం పార్లమెంటు నియోకవర్గపరిధిలోని బీసీలకు రూ.5కోట్ల మేర రుణాలను తొలివిడతగా వివిధ బ్యాంకుల ద్వారా అందజేశారు. మచిలీపట్నంలోని శుభం కన్వెన్షన్‌హాలులో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 110 మంది లబ్ధిదారులకు రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం, ముద్ర రుణాలద్వారా పాడిపరిశ్రమ, డైరీఫాం, మత్స్యసంపద విక్రయాలకోసం ముస్లింలు, మత్స్యకారులు, ఇతర బీసీ వర్గాలు వ్యాపారం చేసుకునేందుకు రుణాలను అందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 54 మంది లబ్ధిదారులకు రూ.2కోట్లు, యూనియన్ బ్యాంక్ ద్వారా 25మంది లబ్ధిదారులకు కోటి రూపాయలు, ఇండియన్ బ్యాంక్‌ద్వారా 10మంది లబ్ధిదారులకు కోటి రూపాయలు, కెనరా బ్యాంక్ ద్వారా ఆరుగురు లబ్ధిదారులకు రూ.40లక్షలు, బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 10 మంది లబ్ధిదారులకు రూ.60 లక్షలను మెగా లోన్‌మేళాలో రుణాలుగా అందించారు. తమకు రుణాలు ఇప్పించిన ఎంపీ బాలశౌరికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

**మరిన్ని రుణాలు అందిస్తాం : బాలశౌరి**

మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పేదలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వివిధ బ్యాంకుల ద్వారా కేంద్రప్రభుత్వం, వివిధ బ్యాంకుల సహకారంతో రుణాలు ఇప్పించే ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని ఎంపీ వల్లభనేని బాలశౌరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, యువతకు విరివిగా రుణాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. తొలి విడతగా రూ.5కోట్లను వివిధ బ్యాంకుల ద్వారా రుణాలుగా ఇప్పించామని, మలివిడతలో మరో రూ.30 కోట్లను లబ్ధిదారులకు రుణాలుగా ఇచ్చేందుకు అన్నిచర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సాంకేతిక కారణాలతో రూ.30కోట్లరుణాలు ఇవ్వడంలో జాప్యం జరిగిందని, సాధ్యమైనంత త్వరలో ఈ రుణాలను మంజూరు చేస్తామని తెలిపారు. కుటుంబాలను చక్కదిద్దడంతో మహిళలపాత్ర కీలకమైనదని, ఈ కారణంతోనే అధికశాతం మహిళలకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకు అధికారులతో స్వయంగా మాట్లాడినట్టు తెలిపారు. రుణాలు పొందిన వారు తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, పిల్లలను ఉన్నతంగా చదివించాలని ఆయన సూచించారు. ముద్ర, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకాల ద్వారా ఎస్‌బీఐ నుంచి రూ.22కోట్లు, యూనియన్‌బ్యాంక్ ద్వారా రూ.9కోట్లు, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ద్వారా ఒక కోటిరూపాయల చొప్పున, కెనరా బ్యాంక్ ద్వారా రూ. 3కోట్లను రుణాలుగా ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేసినట్టు ఎంపీ తెలిపారు.

## 160 మంది కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు

**మచిలీపట్నం టౌన్, మార్చి 11 :** కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న 160 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి ఉత్తర్వులు జారీచేశారు. 29 మంది మల్టీపర్పస్ అసిస్టెంట్లు, 120 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, ఐదుగురు మెడడికల్ ల్యాబ్ టెక్నీషీయన్లకు సోమవారం నాడు ఉత్తర్వులు అందచేశారు.

## ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

**వన్‌టౌన్, మార్చి 11 :** ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో) జనవరి-2024 సెషన్‌కు ఆన్‌లైన్ ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ, పీజీ డిప్లొమా, డిప్లొమా ప్రోగ్రాంలకు దరఖాస్తుల స్వీకరణ ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, మూడో సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు కూడా రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా మార్చి 20వ తేదీ వరకు రూ.200 ఆలస్య రుసుంతో చెల్లించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 ఫోన్ ద్వారా సంప్రతించవచ్చని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

## బాలికపై అత్యాచారం.. ముగ్గురిపై దిశ కేసు నమోదు

**కృత్తివెన్ను, మార్చి 11 :** బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన ముగ్గురు యువకులపై సోమవారం దిశ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.నాగరాజు తెలిపారు. మండల పరిధిలోని ఒర్లగొంది తిప్ప గ్రామానికి చెందిన మానసిక స్థితి సరిగాలేని బాలిక (14) తల్లిదండ్రులు నిల్వ పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లిన సమయంలో గ్రామానికి చెందిన సమీప బంధువులైన ముగ్గురు యువకులు జల్లా ఏసురాజు (29), చెక్క కృపారాజు (28), రేవు వీర్రాజు (27)లు కొంతకాలంగా అత్యాచారానికి పాల్పడుతున్నారు. బాలిక ఆరోగ్యంపై సందేహం వచ్చిన తల్లి బాలికను ఆసుపత్రికి తీసుకెళ్లగా నాలుగో నెల గర్భవతిగా వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆరా తీసి ముగ్గురు యువకులపై మచిలీపట్నం దిశ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు వివరించారు.

## వ్యాన్ ఢీకొని బాలిక మృతి



**మోపిదేవి, మార్చి 11 :** చేపల లోడు వ్యాన్ ఢీకొని బాలిక(8) మృతి చెందిన ఘటన మండలంలోని కొక్కిలిగడ్డలో కృష్ణా కరకట్టపై సోమవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మద్దూరు గ్రామానికి చెందిన విద్య అమ్మమ్మ ఊరు బొబ్బర్లంక వచ్చింది. సోమవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి కరకట్ట దిగువన ఉన్న కాలువలో చేపలు పట్టుకునేందుకు వచ్చింది. ఈలోగా దాహం వేయడంతో మంచినీళ్లు తాగేందుకు వచ్చి రోడ్డు దాటుతుండగా, విజయవాడ వైపు నుంచి వస్తున్న చేపల లోడు వ్యాను బాలికను బలంగా ఢీకొట్టింది. బాలికను స్థానికులు హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోపిదేవి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. సరదాగా అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలికను వ్యాన్ రూపంలో మృత్యువు కబళించటంతో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం మిన్నంటింది.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 112, 121, 132 |
| చికెన్ విత్ స్కిన్ | 210 |
| చికెన్ స్కిన్‌లెస్ | 220 |



**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

## రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ, జనసేన కలయిక

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 11 :** రాష్ట్రాభివృద్ధి, యువత భవిష్యత్తు కోసమే టీడీపీ-జనసేన కలిసి పనిచేయాలని ఇరుపార్టీల అధినేతల నిర్ణయం తీసుకున్నారని, గ్రామస్థాయిలో మనం కూడా కలిసికట్టుగా వైసీపీని ఓడించడమే అజెండాగా పనిచేయాలని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతా శేషుకుమార్, జనసేన మండల కార్యదర్శి వీరం వినయ్‌కుమార్ తెలిపారు. ఆరుగొలనులో ఆదివారం రాత్రి టీడీపీ-జనసేన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వైసీపీ దుష్టపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తుమ్మల బ్రహ్మజీ, మూల్పూరి పూర్ణచంద్రరావు, రావులపల్లి ఆంజనేయులు, టీడీపీ కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

### మంత్రి, అధికారుల తీరుపై

## ఎంపీటీసీ మండిపాటు

**కంకిపాడు, మార్చి 11 :** మంత్రి, అధికారుల తీరుపై అధికార పార్టీ నాయకులే మండి పడుతున్నారు. ప్రారంభోత్సవాలకు ప్రోటోకాల్ పాటించరా అంటూ అదే పార్టీకి చెందిన ఎంపీటీసీ చిట్టూరి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు అంటే అధికారులకు, అధికార పార్టీ నాయకులకు చులకనయితే పార్టీ ఎలా గెలుస్తుందని నిలదీశాడు. సోమవారం కంకిపాడులోని తన ఎంపీటీసీ సెగ్మెంట్ - 1లో అంగన్‌వాడీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారని, ఈ కార్యక్రమానికి మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ హాజరయ్యారని, తన సెగ్మెంట్‌లో ప్రారంభోత్సవం జరుగుతున్నా తనకు సరైన సమాచారం ఇవ్వ లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు అన్నా, ఎంపీటీసీలు అన్నా మంత్రికి, అధికారులకు గౌరవం లేక పోవడం సిగ్గుచేటన్నారు.

### అన్న ఆస్తి కొట్టేశాడని

## సెల్ టవర్ ఎక్కేశాడు



**పెనమలూరు, మార్చి 11 :** ఆస్తి తగాదాల నేపథ్యంలో ఒక వ్యక్తి కానూరులో సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. సోమవారం ఉదయం సెల్ టవర్ ఎక్కిన ఆ వ్యక్తి సాయంత్రం అయినా కిందికి రాకుండా అధికారులను ముప్పు తిప్పలు పెట్టాడు. కానూరు రంగాబొమ్మసెంటరు రామకోటయ్యవీధికి చెందిన గుడివాక వెంకటేశ్వరరావు, గుడివాక రాంబాబు అన్నదమ్ములు. ఆటోనగర్‌లో కొన్నేళ్ల క్రితం ఇద్దరూ కలిసి ఐదువందల గజాల స్థలాన్ని ఉమ్మడిగా కొనుగోలు చేసి అన్నపేరుతో పెట్టాడు. ఇప్పుడు తన వాటా తనకు ఇవ్వమంటే అన్న కుమారులు, అన్న, రౌడీలతో కొట్టిస్తున్నారని, తనకు ఎవ్వరూ న్యాయం చేయడంలేదని ఆరోపిస్తూ దగ్గర్లోని సెల్ టవర్ చివరకు ఎక్కాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్రింది నుంచి అధికారులు, స్థానికుల ఎంత అరిచినా దిగకపోవడంతో ఫైర్ స్టేషనుకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని తమ ప్రయత్నాలు ప్రారంభించారు. ఎట్టకేలకు రాత్రికి కిందికి దిగాడు. దీంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

## డివిడెంట్లు పంపిణీ చేయాలి

**గన్నవరం, మార్చి 11 :** రైతులకు 2016 నుంచి రావాల్సిన డివిడెంట్‌లు వెంటనే పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రెండేళ్ల డివిడెంట్‌లు మాత్రమే పంపిణీ చేయటమేమిటని ప్రశ్నించారు. మండలంలోని ముస్తాబాద పీఏసీఎస్‌లో 2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించి డివిడెంట్‌లను సోమవారం పంపిణీ చేశారు. గతంలో ఇవ్వాల్సిన డివిడెంట్ల పరిస్థితి ఏమిటని, గతంలో జరిగిన అవినీతిని ఎందుకు కప్పిపుచ్చుతున్నారని, నాలుగేళ్లుగా డివిడెంట్లు పంపిణీ చేయకపోవటం వల్ల ఒక్కో రైతు సుమారు రూ.25 వేల వరకూ నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ ఛైర్‌పర్సన్ మేడసాని శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ, గతంలో జరిగిన విషయాలు తనకు తెలియదని , తాను బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఇప్పటి వరకూ రూ.80 లక్షలు సొసైటీ లాభాల్లో ఉందని దానిలో నుంచి రూ.21.56లక్షలు 2074 మంది రైతులకు డివిడెంట్లు రూపంలో అందజేస్తున్నామన్నారు. సీఈవో తగరం గురవయ్య, డైరెక్టర్‌లు నవాబ్ జానీ, కరేటి సాంబశివరావు, సర్పంచ్ వేము రాధాకృష్ణ పాల్గొన్నారు.





# పారిశ్రామిక ప్రగతితోనే రాష్ట్రాభివృద్ధి

- చంద్రబాబు అధికారంలోకి రాగానే ఐటీ కంపెనీల ఏర్పాటు
- కేసరపల్లిలో జరిగిన శంఖారావంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ



యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

**గన్నవరం, మార్చి 11 :** పారిశ్రామిక ప్రగతితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, గన్నవరం నియోజకవర్గంలో పారిశ్రామిక ప్రగతి అడుగంటిందని, ఫార్ములా పీ4తో పూర్వ వైభవం తీసుకొస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని కేసరపల్లిలో సోమవారం శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పుణ్యాచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్ పూలబొకే అందజేసి యార్లగడ్డకు స్వాగతం పలికారు. గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ, జనసేన జెండాలను ఎగురవేశారు. తీన్‌మార్ డప్పులతో, డీజేలతో కార్యకర్తలు, యువకులు సందడి చేశారు. గ్రామంలో పర్యటించిన వెంకట్రావుకు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, అర్హులైన వారికి ఉపాధి చూపడం అంటే బడ్డీ కొట్లు, తోపుడు బండ్లు ఇవ్వటం కాదని పరిశ్రమలు తీసుకు వచ్చి వాటిలో యువతకు ఉద్యోగాలు కల్పించటమేనన్నారు. కీలకమైన రంగాన్ని వైసీపీ ప్రభుత్వ పెద్దలు నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పెట్టుబడులు రాక ఉద్యోగాలు లేక యువతతో పాటు రాష్ట్ర భవిష్యత్ అంధకారంలోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో సింగిల్ విండో విధానం-2015, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ఏర్పాటు చేసి దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఏపీని నిలిపారన్నారు. మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ బస్సుల పరిశ్రమ, కేసరపల్లిలో హెచ్‌సీఎల్ వంటి కంపెనీలు తీసుకు వచ్చారని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమాంతరంగా ప్రజలకు అందించిన నాయకుడు చంద్రబాబు అని చెప్పారు. మీ అందరి సహకారంతో గన్నవరంలో టీడీపీ జెండా అత్యధిక మెజార్టీతో ఎగురవేస్తానని యార్లగడ్డ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణారావు, జనసేన సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, చిమట రవివర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడపాటి రవి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, పలగాని బాలకృష్ణ, మన్నే సుబ్బారావు, రామకృష్ణ, ఎంవిఎల్ ప్రసాద్, మూల్పూరు మాధవన్, వెంకటేశ్వరరావు, లావు వంశీ, మండవ లక్ష్మీ, చిక్కవరపు నాగమణి, జూపల్లి సురేష్, వెంకటేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

### 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

కేసరపల్లికి చెందిన మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, మూడవ సెగ్మెంట్ ఎంపీటీసీ శొంఠి కిషోర్, నిమ్మగడ్డ ప్రసాద్ వర్మ, లక్ష్మణరావుతో పాటు మరో 50 కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరారు. వీరికి యార్లగడ్డ వెంకట్రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, నవ్యాంధ్రను సన్‌రైజ్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ-జనసేన కూటమికి ప్రజాదరణ ఉవ్వెత్తున పెరుగుతుందన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి బోడపాటి రవికుమార్, గూడపాటి తులసీమోహన్, చిరుమామిళ్ల సూర్యం, జాస్తి విజయభూషణ్‌కుమార్, ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావర ప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, జాస్తి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల బాండ్ల సమాచారం అందజేయాలి

**ఎస్‌బీఐల వద్ద వామపక్షాల ధర్నా**




గన్నవరం ఎస్‌బీఐ వద్ద వామపక్ష నాయకుల ధర్నా, జంక్షన్‌లో..

**గన్నవరం, మార్చి 11 :** ఎన్నికల బాండ్ల వివరాల సమాచారం తక్షణమే అందజేయాలని ఎన్నికల సంఘాన్ని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గన్నవరం రాయనగర్‌లోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద సీపీఐ, సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు మాట్లాడుతూ, ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, ఆ సమాచారం అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించటం జరిగిందన్నారు. సీపీఐ నాయకులు పెద్ది వెంకట రత్నం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు రాకుండా కాపాడేందుకు ఎస్‌బీఐ ఒక కవచంలా వ్యవహరిస్తుందన్నారు. వామపక్ష నాయకులు పెద్ది వాసుదేవరావు, టీవీ లక్ష్మణస్వామి, కళ్ళం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి అంజనేయులు, దాసే బాబు, ఖైలే ఏసుదాసు, బెజవాడ తాతబ్బాయి, కొండబాబు, కాట్రగడ్డ రామచంద్ర జోషి, ముక్కామల ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**జంక్షన్‌లో..**

**హనుమాన్‌జంక్షన్ :** ఎన్నికల బాండ్లు సమాచారం అందజేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్టేట్‌బ్యాంకు అధికారులను ఆదేశించిన గడువు కావాలని కోరడం సమంజసం కాదని బాండ్ల సమాచారాన్ని తక్షణమే అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాడ్ చేశారు. సోమవారం స్థానిక విజయవాడ రోడ్డులోని స్టేట్ బ్యాంకు ఎదుట ఎన్నికల బాండ్ల సమాచారాన్ని సుప్రీంకోర్టుకు అందజేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, సీపీఎం బాపులపాడు మండల కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లి ఆంజనేయులు, తోట సాంబశివరావు, తాళం మధు, అబ్దుల్ బారి, కోరం రవి, పలువురు సీఐటీయూ కార్యకర్తలు పాల్గొన్నారు.

**తేలప్రోలులో..**

**ఉంగుటూరు :** ఎన్నికల బాండ్ల వివరాలన్నిటినీ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా తప్పనిసరిగా బహిర్గతం చేయాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా తక్షణమే ఎన్నికల బాండ్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తేలప్రోలు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నేతలు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అజ్మీర్ వెంకటేశ్వరరావు, కె.సీతారామరాజు, టీవీ రామ్మోహనరావు, పిల్లి రాజారావు భీమవరపు సుబ్బారెడ్డి, మాగంటి సాంబశివరావు, సీహెచ్ జోజి, రెహమాన్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

**ఉయ్యూరులో..**

**ఉయ్యూరు :** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల లావాదేవీలు వెంటనే తెలపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వీరమాచినేని జ్యోతి డిమాండ్ చేశారు. ఎన్నికల బాండ్ల వివరాలు తెలియపరచాలని డిమాండ్ చేస్తూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉయ్యూరు బ్రాంచ్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. బ్యాంకు యాజమాన్యం బీజేపీకి కొమ్ము కాస్తుందని ఆరోపించారు. రాజకీయ పార్టీల ఎన్నికల బాండ్లు ఇవ్వడానికి బ్యాంకు అవలంభిస్తున్న విధానాలు సరైనవి కాదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పవన్‌కుమార్, ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి రాజేశ్, నాయకులు అన్నే సుబ్బారావు, రత్నం భాస్కరరావు, పడాల లక్ష్మణరావు, సీఐటీయూ నాయకులు తిరువీధుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం



రెడ్డమ్మనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

**హనుమాన్‌జంక్షన్, మార్చి 11 :** వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి ప్రజలకు వివరించారు. సోమవారం రెడ్డమ్మనగర్‌లో జంక్షన్ పట్టణ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. గన్నవరం టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గార్లపాటి రాజే శ్వరరావు, యార్లగడ్డ సత్యనారయాణ, గుమ్మడి శేషగిరిరావు, వార్డు సభ్యులు తాడిశెట్టి శ్రీను. కడవకొల్లు రాజేష్, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు. ● **పెనమలూరు :** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పేర్కొన్నారు. సోమవారం కానూరు 29వ డివిజన్‌లో జరిగిన బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను వివరించి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు. ● **ఉయ్యూరు :** తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో దళిత, బడుగు బలహీన వర్గాలు, పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు దేవినేని గౌతమ్ అన్నారు. ఉయ్యూరు 15వ వార్డులో సోమవారం పర్యటించి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ● టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్, ఆరు గ్యారెంటీలతో అన్ని వర్గాలకు మేలు కలుగుతుందని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ అన్నారు. ముదునూరులో సోమవారం మూడవరోజు పర్యటించి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, బీసీ డిక్లరేషన్, ఆరు గ్యారెంటీలు వివరించి టీడీపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు దూసర అజయ్‌కుమార్, సంగెపు రంగారావు, మొవ్వ జ్ఞానశేఖర్, పల్లపోతు శ్రీనివాసరావు, ఫణి, నాగరాజు, రామకోటయ్య, వంశీ పాల్గొన్నారు.




ముదునూరులో బోడె వెంకట్రామ్ ప్రచారం, కానూరులో వెలగపూడి శంకరబాబు..

## బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

**పెనమలూరు, మార్చి 11 :** బీసీల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ జనసేన పార్టీలు ఉమ్మడి మేనిఫెస్టోను ప్రకటించాయని, దాంతో పాటు సగర కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏకు మారుస్తామని, భవన నిర్మాణ కార్మికులుగా ఉన్న సగర్లకు రోడ్లు భవన నిర్మాణ కాంట్రాక్టుల్లో తగు ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇవ్వడం ముదావహం అని టీడీపీ బీసీ నాయకులు వీరంకి గురుమూర్తి, జంపన వీరశ్రీనివాస్ అన్నారు. సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో సగరులు ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు. ముందుగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తాడిశెట్టి వీరాస్వామి, అను మోలు ప్రభాకరరావు, పీతా గోపీచంద్, శొంఠి శివరాంప్రసాద్, నక్కా వెంకటేశ్వరరావు, కటారి తిరుపతిరావు, చలపాటి శ్రీను, కర్నాటి అన్నమయ్య, వీరంకి కుటుంబరావు, కోసూరి రమేష్ పాల్గొన్నారు.

### ఎంఈవోగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ

**ఉంగుటూరు, మార్చి 11 :** మండల విద్యాశాఖాధికారి-1గా కొండా రవి కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గన్నవరం ఎంఈవోగా పని చేస్తున్న రవికుమార్‌కు ఉంగుటూరు ఇన్‌చార్జి ఎంఈవోగా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 జె.సాంబశివరావు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యాశాఖ సిబ్బంది శ్రీరామ్, శారద, సీఆర్పీలు పాల్గొన్నారు.

### ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 11 :** విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని షూటింగ్ బాల్ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్ విద్యార్థులకు సూచించారు. వేలేరు హైస్కూల్‌లోని 10వతరగతి విద్యార్థులకు శ్రీసాయి క్రియేషన్స్ ఫిల్మ్ మేకింగ్ సంస్థ సహకారంతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు సోమవారం అందజేశారు. మంగళవారం నుంచి విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.

### వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆకస్మిక మృతి

**గుణదల, మార్చి 11 :** రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పుష్పరాణి అనారోగ్య సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పుష్పరాణి వారం రోజుల క్రితం విధి నిర్వహణలో ఉన్న సమయంలో పాఠశాలలో స్పృహతప్పి పడిపోయింది. పాఠశాల సిబ్బంది ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



ఉయ్యూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసు ప్రత్యేక దళం

## ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి

**ఉయ్యూరు, కంకిపాడులో పోలీసుల కవాతు**

**ఉయ్యూరు, మార్చి 11 :** ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని తెలియజేస్తూ ఉయ్యూరులో సోమవారం పోలీసు ప్రత్యేక దళం కవాతు నిర్వహించారు. ఏ విధమైన భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని ధైర్యం చెబుతూ పట్టణ స్టేషన్ నుంచి ప్రధాన సెంటర్ బస్‌స్టాండ్ సెంటర్, తోట్లవల్లూరు రోడ్డు, కాటూరు రోడ్డు, వీరమ్మ ఆలయ రోడ్డులలో కవాతు నిర్వహించారు. పట్టణ సీఐ హబీబ్ బాషా, ఎస్సై గణేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**కంకిపాడు :** సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని కంకిపాడు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రమైన కంకిపాడు, మద్దూరు, గొడవర్రు గ్రామాల్లో పోలీసు ప్రత్యేక బృందాలతో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్సై డి. సందీప్ పాల్గొన్నారు.



కంకిపాడులో..

## ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఫిర్యాదు

**హనుమాన్‌జంక్షన్, మార్చి 11 :** జంక్షన్‌లోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానిక సువేగా ట్రావెల్స్ సంస్థ నిర్వాహకుడు పి. అంకమబాబు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విజయవాడ, గుడివాడ, నూజివీడు, ఏలూరు రోడ్లలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురై పాదచారుల సైతం ఇబ్బందికి గురవుతున్నారని, వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆక్రమణలు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీస్‌స్టేషన్‌తో పాటు బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శికి కూడా ఫిర్యాదు అందజేసినట్టు తెలిపాడు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 112, 121, 132 |
| చికెన్ విత్ స్కిన్ | 210 |
| చికెన్ స్కిన్‌లెస్ | 220 |

**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

## లూర్థుమాత ఉత్సవాల్లో వెనిగండ్ల దంపతులు



**నందివాడ (వెన్ననపూడి) :** వెన్ననపూడి లూర్థు మాత ఉత్సవాల రెండోరోజు టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సతీమణితో కలిసి పాల్గొన్నారు. రాము దంపతులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. లూర్థు మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షిస్తూ రాము దంపతులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవ వేదికపై రాము సతీమణి సుఖద మాట్లాడారు. గుడివాడ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గ్రామ టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



గిలకలదిండిలో పర్యటిస్తున్న కొల్లు రవీంద్ర



గుడివాడ 18వ వార్డులో ప్రజలతో వెనిగండ్ల కరచాలనం



పద్దారాయుడుతోటలో కుమార్‌రాజా..



గంజాల శ్రీనివాసరావును ఆహ్వానిస్తున్న కాగిత



ఘంటసాల మండలంలో టీడీపీలో చేరిన 150 కుటుంబాల పెద్దలు

# దగాకోరు జగన్‌ను తరిమికొట్టండి

**● రవీంద్ర, వెనిగండ్ల, కాగిత, బుద్ధప్రసాద్, కొనకళ్ల పిలుపు**

**మచిలీపట్నం టౌన్, మార్చి 11 :** సీఎం జగన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొల్లు రవీంద్ర గిలకలదిండి, బుద్దాలపాలెం, బొర్రపోతుపాలెం గ్రామాల్లో జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ , టీడీపీ నాయకులు వాటపల్లి రమేష్ , ఎండీ ఇలియాస్, కుంచే నాని, తలారి సోమశేఖర్‌లతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కొల్లు రవీంద్రకు వివిధ గ్రామాల ప్రజలు అడుగడుగునా స్వాగతం పలికారు. ప్రజలు తమ సమస్యలను కొల్లు రవీంద్రకు వివరించారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటింటికీ కుళాయి ఇస్తామన్నారు. వైసీపీని ఓటు వజ్రాయుధంతో తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు.

### చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరిస్తా : వెనిగండ్ల

**గుడివాడ :** చేతివృత్తిదారుల సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం 18వ వార్డులో వెనిగండ్ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగానమ్మ వీధిలోని వ్యాపారులతో మాట్లాడారు. ముదర్ బజారులోని చేతివృత్తిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, టీడీపీ, జనసేన పట్టణాధ్యక్షులు దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు, నాయకులు అల్లాడ శ్రీనివాసరావు, సోడాబత్తుల సాంబ, మానం రమేష్, చుక్కా సత్యనారాయణ, పిల్లి శ్రీనివాసరావు, తేలు శ్రీనివాసరావు, అల్లాడ సిద్ధూ, కోన రాంబాబు, కరుణకుమార్, గోడబాటి రాము, పిల్లా నాగేశ్వరరావు, సిరిపల్లి బుజ్జి పాల్గొన్నారు.

### తాగునీటి కష్టాలు తీర్చలేని ప్రభుత్వం : కుమార్ రాజా ధ్వజం

**కూచిపూడి :** మొవ్వ మండలంలోని గ్రామాల్లో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వైసీపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేకుండా పోయిందని పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కుమార్ రాజా విమర్శించారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా పద్దారాయుడు తోటలో పర్యటించి ప్రజలు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉందని, ఫిల్టర్ బెడ్లు పాడై పోయాయని, కలుషితమైన నీటిని తాగాల్సి వస్తుందని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాసు, తాతా నారాయణరావు, బత్తిన శ్రీనివాసరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జగన్‌కు చిత్తు చిత్తుగా ఓటమి ఖాయం : కాగిత

**పెడన :** టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తుతో వచ్చే ఎన్నికలలో అరాచక వైసీపీ ప్రభుత్వం చిత్తు కాబోతుందని పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. తోటమూల టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన పట్టణ టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, ఓటమి తప్పదని గ్రహించిన జగన్ మతి భ్రమించి మాట్లాడుతున్నాడన్నారు. జనసేన నాయకురాలు మట్టా శివపావని మాట్లాడుతూ, వైసీపీ పాలనలో పెడన మునిసిపాలిటీ అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందని దుయ్యబట్టారు. యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయూం, వహబ్ ఖాన్, రహమాన్ బేగ్, నారాయణరావు, నాగమల్లేశ్వరమ్మ, పరసా సూర్యనారాయణ, సాంబశివరావు, జనసేన నాయకులు రాము, రంగయ్యనాయుడు, రమణ, షఫీ, కొండా తదితరులు పాల్గొన్నారు.

### మణిమేశ్వరంలో కాగిత సతీమణి శిరీష ప్రచారం



**బంటుమిల్లి :** మణిమేశ్వరంలో టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి శిరీష విస్తృత పర్యటన జరిపారు. సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటా తిరిగి వివరించారు. కాగిత కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కూనపరెడ్డి వీరబాబు, దింటకుర్తి మధుసూదనరావు, వంతా చిన్నా ,యిల్లూరి లీలాకృష్ణ, దాసరి కరుణజ్యోతి, రహమ్‌తున్నీసా, నాగేశ్వరమ్మ, సింగంశెట్టి శ్రీను, కాశీ, కొండ, నజీర్, రేవు గోపాలకృష్ణ, రేవు శ్రీనివాస్, రూకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 150 కుటుంబాలు టీడీపీలో చేరిక

**ఘంటసాల :** మండలంలోని గోగినేనిపాలెం, దాలిపర్రు, తాడేపల్లి, వేములపల్లి, మల్లాయిచిట్టూరు గ్రామానికి చెందిన 150 కుటుంబాలు టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పరుచూరి సుభాష్ చంద్రబోస్ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. అవనిగడ్డ నియోజకవర్గానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వైసీపీ నేత గంజాల టీడీపీలో చేరిక

**పెడన రూరల్ :** గూడూరు మండలం రాయవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గంజాల శ్రీనివాసరావు పెడన నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సమక్షంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పోతన స్వామి, ఎస్‌ఏ బేగ్, చిన్నం వెంకటేశ్వరరావు తదితర దేశం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## తాడేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

**ఘంటసాల, మార్చి 11 :** బడుగు ఆశాజ్యోతి అన్న నందమూరి తారక రామారావు అని వక్తలు కొనియాడారు. తాడేపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని సోమవారం రాత్రి మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలుగుజాతి చరిత్రలో ఎన్టీఆర్‌కు ప్రత్యేక స్థానముందన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొనకళ్ల జగన్నాథరావు, మండలి వెంకట్రామ్, తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మెడబలిమి మల్లిఖార్జునరావు, బండే శ్రీనివాసరావు, తలశిల స్వర్ణలత, మోర్ల రాంబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, భాను ప్రకాష్, గుత్తికొండ వరప్రసాద్, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), దిరిశం వెంకట్రావు, పరిశె చలపతి, కోట విజయ రాధిక, తుమ్మల వరలక్ష్మీ, పైడిపాముల కృష్ణకుమారి, ముప్పనేని రవిప్రసాద్, బండి పరాత్పరరావు, దిరిశం బాలకోటయ్య, యార్లగడ్డ వీరభద్రరావు, దండమూడి శివనాగేశ్వరరావు, సూరపనేని శివరామప్రసాద్, కొడాలి లక్ష్మణరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# రూ.150 కోట్లతో మచిలీపట్నం నగర పాలక బడ్జెట్

**● అంకెల గారడీ : ప్రతిపక్ష కార్పొరేటర్ల ధ్వజం**

**మచిలీపట్నం టౌన్, మార్చి 11 :** ప్రతిపక్ష అధికార పక్ష వాగ్వాదం మధ్య రూ.150 కోట్లతో మచిలీపట్నం నగరపాలకసంస్థ 2024- 2025 వార్షిక బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన సోమవారం మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది.

సాధారణ, మూలధన పద్దుల కింద రూ. 12 కోట్ల2 లక్షల 66 వేల ప్రారంభ నిల్వతో, రూ.145 కోట్ల 61 లక్షల ఆదాయంతో, రూ 150 కోట్ల 2 లక్షల 50 వేలు వ్యయం, రూ.7 కోట్ల 61 లక్షల 66 వేల మిగులుతో బడ్జెట్‌ను ఆమోదించారు. 2023- 2024 సంవత్సరం బడ్జెట్ ను సవరించారు. జనరల్ ఫండ్ నుంచి రూ.4 కోట్ల 22 లక్షలతో రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, మురుగునీటి పారుదల వంటి పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం కోసం రూ.కోటి 22 లక్షలు బడ్జెట్‌లో కేటాయించారు. ప్రతి పక్ష నాయకురాలు మరకాని సమతా కీర్తి , టీడీపీ కార్పొరేటర్లు దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత వివిధ పద్దులపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న , ప్రతిపక్ష టీడీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. బడ్జెట్ అంకెల గారడీ అని ప్రతిపక్ష టీడీపీ కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. ఆదాయ వనరులు పెంచకుండా వ్యయం ఎలా చూపెడతారని టీడీపీ కార్పొరేటర్లు ప్రశ్నించారు. అనంతరం 18 అంశాల అజెండా ప్రవేశపెట్టారు. రూ.11 కోట్ల ముడా నిధులతో వివిధ వార్డుల్లో రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాన్ని అజెండాలో పొందుపరిచి ఆమోదించారు. కోనేరుసెంటర్‌లో మరుగుదొడ్ల సమస్యపై ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించారు. ఖాళీ స్థలాలపై అధికంగా పన్నులు వేశారన్నారు. పాఠశాలల ఆయాల జీతాలు, పారిశుధ్య కార్మికుల సమస్యలపై ప్రశ్నించారు. పార్కుల మెయింటెనన్సు సరిగా ఉండటంలేదని ప్రతిపక్ష సభ్యులు సమతాకీర్తి , దేవరపల్లి అనిత ధ్వజమెత్తారు. అభివృద్ధి పనుల ప్రతి పక్షసభ్యుల డివిజన్‌లలో అభివృద్ధి పనుల కార్యక్రమాలకు ప్రొటోకాల్ ప్రకారంఆహ్వానించడం లేదని దింటకుర్తి సుధాకర్ అన్నారు. ప్రతిపక్ష కార్పొరేటర్‌ల డివిజన్‌లకు ఆశించినంతగా నిధులు కేటాయించడం లేదన్నారు. తాగునీటి రిజర్వాయర్‌ల నిర్మాణం, చెత్త ట్రాక్టర్ల వినియోగంపై చర్చ జరిగింది. నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, ఏఈ సాయి ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.






చల్లపల్లి, గుడివాడలో ఎస్‌బీఐ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

## ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలని ధర్నా

**చల్లపల్లి :** రాజకీయ పార్టీల ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ తక్షణమే వెల్లడించాలని సీపీఎం నాయకులు వాకా రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు చల్లపల్లిలోని స్టేట్‌బ్యాంక్ ఎదుట కాంగ్రెస్, వామపక్ష నాయకులు ధర్నా నిర్వహించారు. ఎస్‌బీఐ తక్షణమే వివరాలు బయటపెట్టి తన విశ్వసనీయత నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ రిజ్వాన్, సీపీఎం కార్యదర్శి యద్దనపూడి మధు, ఎండి.కరీముల్లా, కొండేటి భాస్కరరావు, వెనిగళ్ల వసంతరావు తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** రాజకీయ పార్టీల ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ మోపిదేవిలో ఎస్‌బీఐ ఎదుట వామపక్షాలలు ధర్నా నిర్వహించాయి. సీపీఎం మండల కార్యదర్శి బండి ఆదిశేషు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోసూరు రామాంజనేయులు, ఆయా పార్టీల నేతలు చిరివేళ్ల రాజశేఖర్, కొమ్ము జయరావు తదితరులు ఉన్నారు. **గుడివాడ :** సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్లను బహిర్గతపరచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు ఆర్సీపీ రెడ్డి, పి.రజిని, టి.లక్ష్మణరావు, ఆర్.కొండ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.ప్రభుదాసు, కె.వెంకటేశ్వరరావు, ఐద్వా నాయకురాలు కుమారి, పి.వీరమ్మ, నాయకులు గోట్రు ఎలీషారావు, వెంకటేశ్వరరావు, లోయ కోటేశ్వరరావు, మోహన్, రైతు నాయకులు వీరభద్రరావు, జి.గోపాల్, మేషయ్య తదితరులు పాల్గొన్నారు.

### జ్యోతిబసుకు నివాళి

**కూచిపూడి :** జ్యుడిషియల్ ఉద్యోగ సంఘాల నేత పాగోలు జ్యోతిబసు (54) కూచిపూడిలో గుండెపోటుతో మరణించారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, ఎస్సీ కమిషన్ చైర్ పర్సన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, న్యాయశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, దళిత సంఘాల నాయకులు సోమవారం ఆయన భౌతికకయానికి నివాళులర్పించారు.







### పాడి రైతులకు మిల్క్ యూనియన్ చేయూత : చలసాని



జింజేరులో పాల ఉత్పత్తిదారులతో మాట్లాడుతున్న మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

**పెడన రూరల్ :** పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. జింజేరు, దేవరపల్లి పాల ఉత్పత్తి కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. పశు పోషణకు పలు సూచన చేశారు. మిల్క్‌యూనియన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్జా నగేష్, తోట సత్యన్నారాయణ,చిత్తజల్లు నరసింహస్వామి పాల్గొన్నారు.

### అంబటి బ్రాహ్మణయ్య విగ్రహావిష్కరణ



**కోడూరు :** ఉల్లిపాలెం - భవానిపురం వారధి వద్ద మాజీ ఎమ్మెల్యే అంబటి బ్రాహ్మణయ్య విగ్రహాన్ని మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం ఆవిష్కరించారు. ఉల్లిపాలెం-భవానిపురం వారధికి అంబటి బ్రాహ్మణయ్య వారధిగా నామకరణం చేయగా, ఆయన జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. ఉల్లిపాలెం పీఏసీఎస్ వద్ద జన ఔషధ కేంద్రాన్ని, ఉల్లిపాలెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, అంబటి హరిప్రసాద్, కడవకొల్లు నరసింహారావు, పీఏసీఎస్ అధ్యక్షులు మేడంకి కుటుంబరావు, గ్రామ సర్పంచ్ వర్రే పావని, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



### విశ్వనాథపల్లి నాంచారమ్మ గ్రామోత్సవం ప్రారంభం



**కోడూరు :** విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి గ్రామోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. గ్రామోత్సవం అనంతరం ఈనెల 25న అమ్మవారి జాతర జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి తెలిపారు. ఎం పీపీ కొండవీటి వెంకట కుమారి, నారాయణరావు, కొండవీటి వంశీకులు, గ్రామ పెద్దలు పాల్గొనగా, ఆలయ ఈవో సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



### సంపటాలమ్మ వార్షికోత్సవాలు ప్రారంభం

**చల్లపల్లి :** చల్లపల్లి గ్రామదేవత సంపటాలమ్మ ఆలయ 25వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరపూజ, గోపూజ, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. వేదపండితులు ఘంటసాల శతానందశాస్త్రి జరిపారు. చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు విశేష అలంకరణ చేశారు.

### వైభవంగా శమీ వృక్ష పూజ

**మోపిదేవి :** వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి శమీ వృక్ష పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకులు బుద్ధు నాగ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ సహాయ ఉద్యోగులు వెంకట రమణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### విద్యుత్ చౌర్యం నేరం

**అవనిగడ్డ రూరల్ :** విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఉయ్యూరు ఈఈ డి.కృష్ణ నా యక్ హెచ్చరించారు. సోమవారం జిల్లా విద్యుత్ విజిలెన్స్ అధికారి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యుత్ మీటర్లను విస్తృతంగా తనిఖీ చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో 2199 గృహ, 58 వాణిజ్య సర్వీసులు తనిఖీ చేశామన్నారు. 198 సర్వీసుల వారు అక్రమంగా అదనపు లోడు విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.4.92లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియో గిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడీఈ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, ఏడీలు, జేఈలు సిబ్బంది పాల్గొన్నారు.

### కిడ్నీ బాధితుడికి మాదివాడ ఆర్థిక సాయం

**మోపిదేవి :** కొక్కిలిగడ్డలో కిడ్నీబాధిత నిస్సారపు హరిబాబుకు జనసేన నాయకులు మాదివాడ వెంకట కృష్ణ రూ.10 వేల ఆర్థికసాయమందించారు. సోమవారం కొక్కిలిగడ్డ గ్రామంలో హరిబాబు ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆర్థిక సాయమందించారు. కొక్కిలిగడ్డ గ్రామ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ కొమ్ము పవన్ కుమార్, టీడీపీ నాయకులు కేశాని శివుడు, చందన రంగారావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

**మోపిదేవి :** బొబ్బర్లంక దళితవాడలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు శంకుస్థాపన చేశారు. బొబ్బర్లంక, కొక్కిలిగడ్డ, కె.కొత్తపాలెం గ్రామాల సర్పంచ్‌లు గంగాభవాని, దిడ్ల జానకి రాంబాబు, కొక్కిలిగడ్డ మాధవీ, ఎంపీటీసీ దిడ్ల రాణి, చందన రంగారావు, దొప్పలపూడి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



### విశ్రాంత హెచ్ఎం దుగ్గిరాలకు సత్కారం

**గుడివాడ రూరల్ :** వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దుగ్గిరాల నాగేశ్వరరావు అభినందనీయులని మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ అన్నారు. బొమ్ములూరులో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దుగ్గిరాల నాగేశ్వరరావు దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. విశ్రాంత డీవైఈవో ఘట్టమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దుగ్గిరాల నాగేశ్వరరావు ఉన్నత విలువలతో కూడిన వ్యక్తిగా సమాజంలో జీవించారని కొనియాడారు. విశ్రాంత ఎంఈవో, మోటూరు ఉపసర్పంచ్ నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సమస్యలకు తక్షణ పరిష్కారం : ఎస్పీ

**మచిలీపట్నం టౌన్ :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25 మంది బాధితులు తమ సమస్యలు ఎస్పీకి వివరించారు.

### పాత్రికేయుల నిజాయితీ

**చల్లపల్లి :** చల్లపల్లి పాత్రికేయులు షేక్ ఎజాజ్ అహ్మద్, పెనుమూడి శ్రీనివాసరావు మచిలీపట్నం వైపు నుంచి వస్తుండగా లక్ష్మీపురం పెట్రోల్ బంక్ సమీపంలో పర్సు దొరికింది. పర్సులో నగదు, సుమారు రూ.50 వేల విలువ గల చెవి దిద్దులు, సెల్ ఉన్నాయి. బంటుమిల్లికి చెందిన మాగంటి సత్యనారాయణ,శివపార్వతి పోగొట్టుకున్నట్లు తెలిసింది. చల్లపల్లి ఎస్సై సిహెచ్.చిన్నబాబు ద్వారా పర్సును అందజేశారు.